క్లుప్తంగా

ఆస్పత్రుల్లో జాయింట్ డైరెక్టర్ తనిఖీ

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణ పరిధి రామవరం ఎంసీహెచ్ ఆస్పత్రి, భద్రాచలంలోని ప్రభుత్వాస్పత్రిని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ (చైల్డ్ హెల్త్ ఇమ్యూనైజేషన్) డాక్టర్ సుధీర్ శనివారం తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ నాయక్, రాష్ట్ర బృందం సభ్యులు పీటర్సన్, స్టాటిస్టికల్ ఆఫీసర్ రవి నాయుడు, న్యూట్రిషన్ కన్సల్టెంట్ బద్రి, బయో మెడికల్ ఇంజనీర్ మధు, డేటా మేనేజర్ నాగభూషణం తదితరులున్నారు.

సోలార్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో సోలార్ కార్మికులు ఏళ్ల తరబడి పలు సమస్యలతో సతమతం అవుతున్నారని, తక్షణం వారి సమస్యలను పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఏ నబీ కోరారు. ఈ మేరకు శనివారం ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. సోలార్ కాంట్రాక్టర్ తక్కువ వేతనాలు చెల్లిస్తూ ఎక్కువ పని గంటలు చేయిస్తున్నాడని తెలిపారు. అబ్దుల్ నబీ, ప్రేమ్‌సింగ్, శంకర్, కల్యాణ్, ఉపేందర్ పాల్గొన్నారు.

వర్క్‌షాప్ డెలిగేట్ల ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

ఇల్లెందు: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏరియా వర్క్‌షాప్ పిట్ కార్యదర్శిగా యుగంధర్ ఎన్నికయ్యారు. శనివారం ఇల్లెందు ఏరియా వర్క్‌షాప్ డీవైజీఎం శేఖర్‌బాబును ఏఐటీయూసీ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి నూతన కమిటీని పరిచయం చేశారు. పిట్ సహాయ కార్యదర్శి భూషణం ధర్మయ్య, మంగపతి, సీహెచ్ఆర్ఎల్ రావులతో పాటు 11 మంది డెలిగేట్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, స్టాలిన్, విశ్వనాథం, వెంకట్‌రెడ్డి, నూనె శ్రీనివాస్, దాట్ల శ్రీకాంత్, దాట్ల వెంకటేశ్వర్లు, బట్టు రవి, అజ్మీర సోనీ, భద్రమ్మ, స్వరూప పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న జీవన్‌కుమార్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టీఏఎస్కే) ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఎంప్లాయిబులిటీ స్కిల్స్ అనే అంశంపై విద్యార్థినులకు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. నాంది ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జీవన్‌కుమార్ మాట్లాడుతూ... విద్యార్థినులకు ప్రొఫెషనల్ ఎథిక్స్, ఎఫెక్టివ్ స్పీకింగ్, గ్రూప్ డిస్కర్షన్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ ప్రిన్సిపాల్ శారద, టీఏఎస్కే కోఆర్డినేటర్ కె.ఆశాజ్యోతి, జి.సునీత పాల్గొన్నారు.

సంబురాలకు సిద్ధం



- రేపు హోలీ..
- హాని కలిగించని రంగులు చల్లుకోవాలంటున్న పర్యావరణవేత్తలు
- వాగులు, కాలువల వద్ద పోలీసుల పహారా..



రామవరంలో రంగుల దుకాణం

కొత్తగూడెంటౌన్: వసంత రుతువును ఆహ్వానిస్తూ వచ్చే పండుగ హోలీ.. అందరికీ ఆనందాలు పంచే హోలీ పండుగను ప్రజలందరూ సోమవారం జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. చిన్నాపెద్ద తేడాలు లేకుండా అందరూ సంతోషంగా జరుపుకునే పండుగ హోలీ పండుగకు ఒకరోజు ముందు కాముడిని కాల్చి మరుసటి రోజు ఒకరికొకరు రంగవల్లులు చల్లుకుని శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పండుగను ఆనందంగా జరుపుకుంటారు.

పిల్లలు, పెద్దలు ఇంటింటికీ తిరిగి డబ్బులు అడిగి అందరూ కలిసి రంగులను కొని సంబురాలు చేసుకుంటారు. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం పెద్దబజార్, చిన్న బజార్, రామవరం, రుద్రంపూర్, పాత కొత్తగూడెం, విద్యానగర్ కాలనీ ప్రాంతాల్లో మార్వాడీ కుటుంబాలు ఊరేగింపులు, దాండియా ఆటపాటలతో హోలీని ఘనంగా నిర్వహిస్తారు. ఈసారి వాగులు, కాలువల వద్ద హోలీకి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి భద్రతా చర్యలు తీసుకుంటున్నారు.

> **హోలీ రంగుల పండుగ.**
> వసంతోత్సవం లేదా కాముని పండుగ అని కూడా అంటారు. ఫాల్గుణ మాసం.. పౌర్ణమి.. చల్లగాలులు వేదెక్కే వేళ.. లేలేతచిగుళ్లతో విరబూసిన పూరెమ్మలతో చెట్లన్నీ వసంతరాగాలతో పులకిస్తుండగా హోలీ వస్తుంది. ఈ పండుగకు బంధువులు, స్నేహితులతో కలిసి నీళ్లలో రంగులు కలిపి చల్లుకోవడం, రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ చిన్నాపెద్దా తేడా లేకుండా వీధుల్లో కేరింతలతో సంబురాలు జరుపుకుంటారు.

సండే స్పెషల్

జోరుగా రంగుల అమ్మకాలు...

కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, అశ్వారావుపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, సూజాతనగర్, జూలురుపాడులతో పాటు పలు ప్రాంతాల్లోని వాగులు, కాలువలతో పాటు పలుచోట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి పండుగను విషాదం లేకుండా సంతోషంగా జరుపుకోవాలని అధికారులు, పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. హోలీ సందర్భంగా మార్కెట్లలో రకరకాల రంగులను కుప్పలుగా పోసి చిరువ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు. టీ కప్పులతో రంగులను ఒక కప్పు రూ.10కి అమ్ముతున్నారు. అలాగే చిన్నారులు రంగులను చల్లుకునేందుకు తుపాకులు వంటి బొమ్మలు కూడా మార్కెట్‌లోకి వచ్చాయి.

రంగులతో భద్రం..

అందరూ సంతోషంగా జరుపుకునే పండుగ రంగవల్లుల పండుగ హోలీకి రంగులు చల్లుకునే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని, శరీరానికి హాని కలిగించే రంగులకు దూరంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. అందరూ శరీరానికి హాని కలిగించే రంగులను వాడకుండా ఉండాలని, అదేవిధంగా కోడిగుడ్లు, టమాటాలు వంటివి తలపై పగులగొట్టడం లాంటివి చేయకూడదని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు.

చెరువులు, వాగుల వద్ద తస్మాత్ జాగ్రత్త...

కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లోని పాల్వంచ కిన్నెరసాని పక్కనే కిన్నెరసాని కాలువలు ఆనుకుని ఉన్న ప్రాంతాలు.. కొత్తగూడెంలో గరిమెళ్లపాడు, లక్ష్మీదేవిపల్లిలోని ముర్రేడు వాగు, రామవరంలోని గోధుమవాగు, జూలురుపాడు, సూజాతనగర్ సమీపంలోని నర్సింహాసాగర్‌లతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వాగులు, కాలువల వద్ద హోలీ పండుగ తరువాత స్నానాలకు వచ్చేవారు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు పర్యవేక్షణ చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు, పెద్దలు కోరుతున్నారు. హోలీ సంబురాల్లో భాగంగా తరువాత కొందరు స్నానాలు చేయడానికి ... స్నేహితులు, బంధువులతో దగ్గరలోని వాగులు కాలువల వద్దకు వెళ్లి సంబురాలు జరుపుకుంటారు. సంబురాల అనంతరం మద్యం మత్తులో కొందరు, రంగులను తొలగించుకోవాలని కొందరు వాగుల్లోకి, కాలువల్లోకి దిగుతారు. అలాంటి వారు లోతుకి వెళుతుంటారు. ఈత రాని వ్యక్తులు లోతు గమనించకుండా వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. గతంలో ఇలా హోలీ పండుగకు వెళ్లి ప్రమాదాల బారిన పడి మరణించిన సంఘటనలు కొత్తగూడెం చుట్టుపక్కల ప్రాంతాల్లో జరిగిన సందర్భాలు ఉన్నాయి. సరదా కోసం వెళ్లిన వారు ఆ సరదా కాస్తా విషాదాంతం కావద్దని పర్యావరణవేత్తలు, పోలీసులు కోరుతున్నారు. హోలీ పండుగ వేళ జాగ్రత్తలు పాటించాలని వాగులు, కాలువల వద్దకు వెళ్లొద్దని సూచనలు చేస్తున్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి..



హోలీ పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి. రంగులు చల్లుకుని వాగులు, కాలువల వద్దకు వెళ్లకూడదు. పండుగ రోజు పోలీసుల భద్రత ఉంటుంది. ఎలాంటి సంఘటనలు జరిగినా తమకు సమాచారం ఇవ్వాలి. మద్యం మత్తులో ఎవరూ రోడ్లపైకి రావద్దు.

– ఎం.కరుణాకర్ వన్‌టౌన్ సీఐ కొత్తగూడెం

పర్యావరణానికి హాని జరగొద్దు..



హోలీ పండుగ సంబురాలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలి. శరీరానికి హాని కలిగించే రసాయనాలు కలిగిన రంగులను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు. గుడ్లు, టమాటా లాంటివి ఒంటిపై కొట్టకుండా చూసుకోవాలి. పర్యావరణాన్ని పరిరక్షించాలి.

– సూర్వి రాజశేఖర్, మొక్కల ప్రేమికుడు

సమగ్రాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచరూరల్: మండలాన్ని సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని జగన్నాథపురం, తోగ్గూడెం గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మండలాభివృద్ధికి ప్రణాళిక రూపొందించి ప్రాధాన్యత ప్రకారం పనులను పూర్తి చేస్తామని చెప్పారు. తోగ్గూడెం వద్ద ముర్రేడు వాగుపై చెక్‌డ్యామ్‌ను నిర్మాణం చేసి రైతులకు రెండో పంటకు నీరు అందిస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. తోగ్గూడెం మాజీ సర్పంచ్ శాంతితోపాటు 150 కుటుంబాలు సీపీఐలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వినంశెట్టి పూర్ణచందర్‌రావు, నాయకులు ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకన్న, గిరి, జర్పుల మోహన్, సత్రు, రామకృష్ణ, జకరయ్య, బాదావతు శ్రీను, కె.వెంకన్న, నందనాయక్, జోషి, జి.నర్సింహారావు, కొండం పుల్లయ్య, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా నాగేశ్వరరావు



నాగేశ్వరరావుకు నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి శ్రీనివాసరావు

ఇల్లెందురూరల్: ఇల్లెందు పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా కొమరారం డైరెక్టర్ పోలేపల్లి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు వైస్‌చైర్మన్‌గా ఉన్న బండారు శ్రీనివాస్‌పై అవిశ్వాసం పెట్టడంతో అతనే స్వయంగా తన పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్‌చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో వారం క్రితం ఎన్నికపై నోటిఫికేషన్ జారీ చేసిన ఎన్నికల అధికారి శ్రీనివాసరావు శనివారం ఎన్నిక నిర్వహించారు. వైస్ చైర్మన్ పదవి కోసం పోలేపల్లి నాగేశ్వరరావు నుంచి ఒక్కటే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ప్రకటించారు. నియామక పత్రాన్ని నాగేశ్వరరావుకు అందజేశారు. నాగేశ్వరరావును పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, డైరెక్టర్లు అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల డిమాండ్స్ డే



ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): దేశ వ్యాపితంగా మీడియా సంస్థలు, జర్నలిస్టుల సంక్షేమం కోరుతూ షహీద్ భగత్‌సింగ్ వర్ధంతిన శనివారం జర్నలిస్ట్ డిమాండ్ డేను నిర్వహించాలని జాతీయ, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు కొత్తగూడెం ఆర్‌డీఓ మధుకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల భద్రతకు చట్టం తీసుకరావాలని, వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో దుద్దుకూరి రామారావు, ఇమంది ఉదయ్‌కుమార్, యర్రా ఈశ్వర్, ఏర్పుల సుధాకర్, ఎం.రాజేష్, బాపట్ల మురళి పాల్గొన్నారు.

'శ్రీరాగా'లో హోలీ సంబురాలు



రంగులు చల్లుకుని సంబురాలు జరుపుకుంటున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి మేదరబస్తీలోని శ్రీరాగా ప్లే స్కూల్‌లో శనివారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్ హోలీ పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ప్లే స్కూల్ చిన్నారులు ఒకరికొకరు రంగులు పులుముకున్నారు. చిన్నారులతో కలిసి డైరెక్టర్ కవిత, ఉపాధ్యాయులు సంతోషంతో రంగులు చల్లుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, సంధ్య, యాస్మిన్, మాధవి, శ్రీలత, శ్రీధర్, ప్రభాకర్, హైందవి, అరుణ, నాగమణి, పూజిత, సురేష్, కౌసర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



సీడీపీఓ రేవతికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

పాల్వంచరూరల్: అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం పెద్దమ్మగుడి వద్ద సీడీపీఓ రేవతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఐసీడీసీఎస్ పాల్వంచ ప్రాజెక్టు పరిధిలో 2019 ఆగస్టు వరకు అంగన్‌వాడీలకు ఒక్కొక్కరికి రూ.11వేలు, 2020 సెప్టెంబర్‌లో ఒక్కో కేంద్రానికి రూ.2400 బకాయలు రావాల్సి ఉందన్నారు. పనిచేయని సెల్‌ఫోన్లు మాకు వద్దని నాణ్యతతో కూడిన సెల్‌ఫోన్, ట్యాబ్‌లను ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న గ్యాస్ బిల్లులు, ఇంటి అద్దెలు చెల్లించాలని, మే నెలంతా వేసవి సెలవులు ఇవ్వాలని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జిలకర పద్మ, పట్టణ కన్వీనర్ కె.సత్య, లక్ష్మి, అచ్చమ్మ, రమ్య, శ్రీదేవి, కృష్ణవేణి, భాను తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామంలో రాధాకృష్ణుల కల్యాణం సందర్భంగా ఎనిమిది మండలాల స్థాయి వాలీబాల్ పోటీలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శనివారం పోటీలను కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని కొద్దిసేపు క్రీడాకారులతో కలసి వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామాలలో యువత ఖాళీ సమయాలలో వాలీబాల్, కబడ్డీ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమన్నారు. అనంతరం రాధాకృష్ణుల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఫీజు తగ్గించండి

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం పెంచిన ఫీజును వెంటనే తగ్గించాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఒక పేపరుకు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఫీజు ఉండగా, దాన్ని ఇప్పుడు ఒక పేపరుకు రూ.1000, రెండు పేపర్‌లకు రూ.2 వేల ఫీజును పెంచటం బాధాకరమని పేర్కొన్నారు.

అధిక ఫీజులు లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్నదని, దానిని దృష్టిలో ఉంచుకొని టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని కోరారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలి



ఇల్లెందురూరల్: కొమరారంలో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): దేశానికి స్వాతంత్రం కోసం తెల్లదొరలను ఎదురించి తమ ప్రాణాలను త్యాగం చేసిన ధీరులు భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షురాలు సంధ్య, పీవైఎల్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి బానోత్ జగదీష్ అన్నారు. శనివారం పీవైఎల్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు ఎర్రపూలు చల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారికి ఎదురొడ్డి పోరాడారని కొనియాడారు. రజాక్, సాయి, ముఖేష్, ఉదయ్, శశి, తరుణ్, వినయ్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో విద్యార్థులు, యువత ఉద్యమించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడులో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. ఎస్కే చాంద్‌పాషా, నరేష్, సతీష్, ఖాసీం పాల్గొన్నారు.

పీవైఎల్ ఆధ్వర్యంలో..

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో శనివారం అన్నారుపాడు, గుండ్లరేవు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పీవైఎల్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి బానోత్ జగదీష్, ఎస్‌డీ రజాక్, మల్కం సతీష్, తెల్లం పాపారావు, వెట్టి కృష్ణ, అర్జున్‌రావు, కేశవరావు, రవి పాల్గొన్నారు.

ఇల్లెందు: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని నంబర్–2 బస్తీలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్‌గౌడ్, భాస్కర్, రవి, వెంకటేష్, రాకేష్, ఆనంద్ పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమంలో బయ్యా అభిమన్యు, కిషన్, సురేష్, నవీన్, ప్రవీన్, రాజు, వినయ్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతిని శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, అధ్యాపకులు శేఖర్, కిరణ్‌కుమార్, రాజు, చెంచు రత్తయ్య, సరిత, సురేందర్ తదతరులు పాల్గొన్నారు.

కొమరారం గ్రామంలో...

పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో శనివారం కొమరారం గ్రామంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి నిర్వహించారు. అమరులను స్మరించుకుంటూ గ్రామంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు.సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు నాయని రాజు, అజ్మీర బిచ్చా, పూనెం కుమార్, ఇస్లావత్ కోటేష్, ధారావత్ దేవా, బుర్ర వెంకన్న, బుర్ర రాఘవులు, కోరం ముత్తమ్మ, ఎలుగు శాంతారావు, లక్ష్మణ్, చిన్న, కోటేష్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: భగత్ సింగ్, రాజ్‌గురు సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని గురుకుల కళాశాలలో శనివారం కాగడలతో ప్రదర్శన నిర్వహించారు. కళాశాల నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రచయిత శిరంశెట్టి కాంతారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కళాకారుడు ఎస్కే పాషా, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ పాల్గొన్నారు.



ఇల్లెందు: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో...



సింగరేణి(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు



జూలూరుపాడు: నివాళులర్పిస్తున్న మాస్‌లైన్ నాయకులు

అంగన్‌వాడీల్లో తల్లీబిడ్డలకు పౌష్టికాహారం



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న సీడీపీఓ కె.రేవతి



టేకులపల్లి: బోడు అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



ఇల్లెందురూరల్: పోషకాహారం ఆవశ్యకతను వివరిస్తున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

పాల్వంచరూరల్: గర్భిణులు నిత్యం పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ కె.రేవతి సూచించారు. మండల పరిధి పెద్దమ్మగుడి వద్ద శనివారం లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాలకు సంబంధించిన పోషణ్ పక్వాడ్ వారోత్సవాల ముగింపు సందర్భంగా పౌష్టికాహారం ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడారు. ఆహారంలో తృణధాన్యాలను తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, సఖి సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ శుభశ్రీ, మహిళా శక్తి జిల్లా కోఆర్డినేటర్ రూప, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

టేకులపల్లి: అంగన్‌వాడీల్లోనే బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం లభిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సూపర్‌వైజర్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బోడు సెక్టార్ సూపర్‌వైజర్ సక్కుబాయి ఆధ్వర్యంలో బోడు అంగన్‌వాడీ కేంద్రంలో, బొమ్మనపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ యశోద ఆధ్వర్యంలో మద్రాస్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. తల్లులు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు పరిశుభ్రత, పోషకాహారంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బోడు, బొమ్మనపల్లి సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లు ఎం.సుజాత, కె.రాజేశ్వరి, వరమ్మ, నిర్మల, కౌసల్య, చిన్న నర్సమ్మ, బేబీరాణి, రమణ, స్వరూప, కృష్ణకుమారి, సత్యవతి, రామలక్ష్మి, స్వాతి, అనసూర్య, సుమలత పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ప్రతీఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. మండలంలోని రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీఒక్కరు తమ ఇళ్లల్లో బలమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలకు అధిక ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు ఆంద్రజ్యోతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.